క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుడు భార్యకు తక్షణ సహాయం అందజేస్తున్న సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్–2లో ఇటీవల అనారోగ్యంతో రాయిపల్లి ఆనందరావు మృతి చెందారు. ఆయనకు వైఎస్ఆర్ బీమా వర్తించింది. దీంతో అతని భార్యకు బుధవారం సంబంధిత సచివాలయం సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తక్షణ సహాయం కింద రూ.10 వేల అందజేశారు. మిగిలిన రూ.90 వేలు బ్యాంక్ ఖాతాలో కొద్ది రోజుల్లో జమచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థాక నాయకులు కెల్ల సత్యనారాయణ, పోలరావు, దుర్గారావు, వెంకటరెడ్డి, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో వీడియో కాన్ఫరెన్స్

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సుల సిలబస్ సవరణ కోసం ఏర్పాటు చేసిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో యూఎస్ఏ, నార్వేకు చెందిన హోటల్ ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూరు తదితర పట్టణాలలో హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు ఆటల పోటీలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం పరిధిలో విద్యార్థులకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీల నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం దుర్గాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసు గల విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 23 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్స్‌తో పాటు యోగాలో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రోజూ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

మహిళా జనోద్ధారకుడు గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల నాగేశ్వరరావు గురజాడ స్మారక ఉపన్యాసం చేశారు. ఆధునిక సాహిత్యానికి గురజాడ దీపం వంటివారని కొనియాడారు. తన కాలం కంటే ముందున్న సాహితీ ద్రష్ట, కవి సంస్కర్త, వైతాళికుడు గురజాడని పేర్కొన్నారు. నా అడుగుజాడ గురజాడ అని సగౌరవంగా శ్రీశ్రీ ప్రకటించారని గుర్తుచేశారు. ఆధునిక మహిళ చరిత్ర తిరగ రాస్తుందని అంటూ స్త్రీ జనోద్ధారణకు నడుం బిగించి రచనలు చేసిన క్రాంతదర్శి గురజాడ అన్నారు. కన్యాశుల్కం నాటకం రూపొంది వందేళ్లు దాటినా అందులోని పాత్రలు, సంభాషణలు, చమత్కారాలు నేటికీ సజీవంగా ఉన్నాయంటే రచయిత గొప్పతనం అర్థం చేసుకోవచ్చన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, ఎం.విజయగోపాల్, భాగవతుల సత్యనారాయణమూర్తి, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డి.నారాయణాచార్యులు, సుబ్బలక్ష్మి, కె.వి.ఎస్.నరసింహం, రామతాత, పి.వి.ఆర్. కుమార్‌రావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘భవన’ బృంద పర్యవేక్షణ

- ఏయూ భవనాల దృఢత్వం కోసం విద్యార్థులతో బృందాల ఏర్పాటు
- కాలానుగుణంగా తక్షణ చర్యలకు అవకాశం
- వర్సిటీ ప్రగతికి దోహదం



ఇటీవల నిర్మించిన ఏయూ సిబ్ భవనం



పురాతన ఇంజినీరింగ్ కళాశాల భవనం

ఏయూ క్యాంపస్: సువిశాలమైన 500 ఎకరాలకు పైగా విస్తీర్ణం.. 260కు పైగా భవనాలు ఆంధ్ర విశ్వ విద్యాలయం సొంతం. వీటిలో కొన్ని రాతితో.. మరికొన్ని నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ భవనాలు ఉన్నాయి. ఇటీవల కొత్తగా పదికి పైగా భవనాలు నిర్మించడంతో పాటు, మరో 10 పాత భవనాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి కొత్తవాటిలా తీర్చిదిద్దారు. ఈ భవనాల నిర్వహణ.. సంరక్షణ.. అవసరమైన సమయంలో మరమ్మతులు చేపట్టడం వర్సిటీకి ప్రత్యేక వ్యవస్థ అవసరం ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఏయూ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ముగ్గురు విద్యార్థులతో బృందాలు

వర్సిటీలోని సివిల్, ఆర్కిటెక్చర్, జియో ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక్కో విభాగం నుంచి ఒక్కో విద్యార్థిని భాగం చేస్తూ ముగ్గురితో ఒక బృందం ఏర్పాటు చేసి ఒక్కో భవనాన్ని కేటాయిస్తారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థికి అవకాశం ఇస్తారు. దీని వల్ల సుమారు మూడు సంవత్సరాల కాలం ఒక భవన నాణ్యత, ప్రమాణాల పరిరక్షణ, అవసరమైన మరమ్మతులు చేపట్టడం వంటి పనులపై విస్తృత అవగాహన పొందే అవకాశం కలుగుతుంది. భవనం నాణ్యత, అంతర్గతంగా ఏర్పడే సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తారు. దీనిని పరిశీలించిన ఇంజినీరింగ్ కార్యాలయం సిబ్బంది వెంటనే పునరుద్ధరణకు అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో భవనానికి సంబంధించిన సమగ్ర సమాచారం యాప్‌లో భద్రంగా ఉంటుంది. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు మెరుగైన పరిష్కారాలు చూపడానికి ఒక డేటా బ్యాంక్‌గా కూడా పని చేస్తుంది.

ప్రత్యక్ష ఆచరణకు అవకాశం

తరగతి గదిలో నేర్చుకునే అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా ఆచరణలో చూపే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థికి కేటాయించిన భవనంలో వారంలో ఒక రోజు భవనాన్ని పరిశీలించి స్ట్రక్చరల్, నాన్ స్ట్రక్చరల్ క్రాక్స్ వంటివి పరిశీలిస్తారు. ఫ్లోర్ సెటిల్‌మెంట్, ప్లింత్ బీమ్‌లో సమస్యలు వంటివి గుర్తించి తెలియజేస్తారు. భవన పటిష్ఠతను గుర్తించడానికి ఎన్‌డీటీ టెస్ట్‌లు చేస్తారు. వీటిలో సైతం విద్యార్థులు భాగస్వాములు అవుతారు. భవనానికి మరమ్మతులు చేపట్టే సమయంలో కూడా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తారు. ఈ నూతన ప్రాజెక్ట్ విద్యార్థులకు ఒక ప్రత్యక్ష ప్రయోగశాలగా దోహదపడుతుంది.

మంచి ఆలోచన



విద్యార్థికి దాదాపు మూడు సంవత్స రాల కాలం ప్రత్యక్షంగా తర్ఫీ దు పొందేలా ఈ ప్రాజెక్ట్ నిలుస్తుంది. విద్యార్థి ఇంజినీరింగ్ పూర్తి చేసే సమయానికి పూర్తి స్థాయి నైపుణ్యాలు పొందడం సాధ్యపడుతుంది. విద్యాభ్యాసంతో పాటు నైపుణ్యాలను అందించేలా ఈ కార్యక్రమం రూపొందించడం మంచి ఆలోచన.

– ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి

సద్వినియోగం చేసుకోవాలి..



వర్సిటీ అధికారులు విద్యార్థులకు అందిస్తున్న ఒక మంచి అవకాశంగా ఇది. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా చేసే అవకాశం కలుగుతోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఆచార్య జి.శశిభూషణరావు, ప్రిన్సిపాల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

ఇంటర్న్‌షిప్‌గా పరిగణన



విద్యార్థులు వర్సిటీలో ప్రత్యక్షంగా నేర్చుకుంటూ, వర్సిటీ ప్రగతిలో భాగం అయ్యే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తాం. దీనిని ఇంటర్న్‌షిప్‌గా పరిగణిస్తూ, విద్యార్థికి సర్టిఫికెట్ అందించే ఆలోచన ఉంది. ఇంజినీరింగ్ పూర్తిచేసే సమయానికి మంచి నైపుణ్యాలు అలవడతాయి.

– ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, వీసీ, ఏయూ

ఎల్‌వీపీలో ఫాల్ ప్రివెన్షన్ సెంటర్ ప్రారంభం



ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో ఫాల్ ప్రివెన్షన్ సెంటర్ ప్రారంభిస్తున్న అరబిందో జీఎం కమలాకర్

ఆరిలోవ: ప్రపంచ ఫాల్ ప్రివెన్షన్ వారోత్సవాలలో భాగంగా బుధవారం హనుమంతవాక వద్ద ఎల్‌వీపీ కంటి ఆస్పత్రిలో ఫాల్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని అరబిందో ఫార్మా లిమిటెడ్ జనరల్ మేనేజర్ కె.కమలాకర్ విఠల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి సమావేశ మందిరంలో వృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అవినాష్ పతంగే మాట్లాడుతూ వృద్ధులు ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంట్లో, బాత్‌రూంలలో ఎలాంటి ఫ్లోరింగ్ వేసుకోవాలో సూచించారు. వృద్ధుల కోసం మెట్ల పక్కన ఎలాంటి సపోర్టు ఉండాలి, తదితర విషయాలు తెలియజేశారు. ఇంట్లో గచ్చుపై జారకుండా ఎలాంటి మేట్‌లు వినియోగించాలో వివరించారు. ఆస్పత్రికి వచ్చిన వృద్ధులకు వీటిపై అవగాహన కల్పించడానికి ఫాల్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

ఆరిలోవ: గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ అయిన ఆరిలోవకు చెందిన వడ్డాది మురళీ కృష్ణ గంజాయికి బానిసయ్యాడు. దీంతో పాటు బయట నుంచి గంజాయి తీసుకొచ్చి స్నేహితులకు విక్రయిస్తుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం గంజాయి విక్రయిస్తుండగా ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య వద్ద హాజరుపరిచారు. ఆయన సూచనల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు.

దేశభక్తి గీతాలపై పోటీలు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాల సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సాహితీ స్రవంతి సంస్థ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ‘గురజాడ ఆశించిన సమాజం ఫలించిందా?’ అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలు పి.దిలీప్, ఎస్.ఎల్.ఎస్. వర్ధన్, టి.వైష్ణశ్రీ, ఈ.రవళి, వై.వందనకు సాహితీ స్రవంతి ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ బహుమతులను అందజేశారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, సాహితీ స్రవంతి సభ్యులు ఎం.ఆనంద శర్మ, ఆంథోని, వెంకట్, వసంతకుమార్, పి.ఫ్రాన్సిస్, పి.రామారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

ఉక్కు పరిరక్షణకు మరో అడుగు

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణకు మరో అడుగు వేస్తూ ఉత్తరాంధ్రలో బైక్ యాత్రను నిర్వహిస్తున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేసే ఆలోచనతో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర ఈ నెల 29 వరకు ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల్లో 1150 కిలోమీటర్ల మేర నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 951వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బైక్ యాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుల, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

డిగ్రీలో ప్రవేశానికి రేపటితో గడువు పూర్తి

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి శుక్రవారంతో గడువు ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీటు అలాంట్ అయిన వారు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మద్దిలపాలెం : చట్ట సభలో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ తెలిపారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించామని ఆయన తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పార్లమెంట్ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీలలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు శ్యాంసుందర్, మహేష్, ఆజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ఆరిలోవ: పిల్లలు ఆరోగ్యంపై ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రక్త హీనత లేకుండా ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి, బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలు, తదితర వాటి గురించి వివరించారు. రక్త హీనత వల్ల పిల్లలు మానసిక ఏకాగ్రత కోల్పోతారన్నారు. అలాగే చదువుపై ఆసక్తి తగ్గిపోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు అందుబాటులో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలలో హెచ్‌బీ లెవెల్స్ కోసం రక్త రీక్షలు జరిపించుకోవాలని సూచించారు. ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీసీసీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ ఇచ్చే ప్లాన్స్ ఉన్నాయని తెలిపారు. చిన్న చిన్న మొత్తాల్లో పొదుపు జమ చేసి భవిష్యత్ అవసరాలకు పెద్ద మొత్తంలో అందుకునేలా చాలా రకాల పొదుపు పథకాలు ఉన్నాయన్నారు. తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కె.శ్రీదేవి, మేనేజర్ ఎస్.సంతోష్, ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, పోస్ట్ మాస్టర్ బి.యేసు, సిబ్బంది తపాలా శాఖ అందిస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

మైనర్ డ్రైవింగ్ నేరం

అల్లిపురం : మైనర్ డ్రైవింగ్ నేరమని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం కూడా నేరమేనని ఆయన స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు బుధవారం పోలీస్ కమిషనరేట్‌లో గల పోలీస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. వారిలో కొంత మందికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. వీరిలో ఎక్కువ శాతం యువకులు ఉండడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వలన జరిగినవేనన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అన్నానగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శ్రీకారం చుట్టారు. తోటగరువు దరి అన్నానగర్‌లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం కోసం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డులో అన్ని కాలనీల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణంతో పాటు గెడ్డల ఆధునికీకరణ కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. అన్నానగర్‌లో రూ.45 లక్షలు జీవీఎంసీ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సీఎం ఆదేశాలతో జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టి నగరం సుందరీకరణకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కొరికాన మోహనరావు, ఒమ్మి చిన్నారావు, ఒమ్మి రామారావు, సతీష్, స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



దుర్గాగణపతి సన్నిధిలో మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ గోవింద్



పెదవాల్తేరు శ్రామిక్ నగర్‌లో



ఏయూ అవుట్‌గేట్ డౌన్‌లో



పాత వెంకోజీపాలెంలో కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ఏయూ క్యాంపస్: బొజ్జ గణపయ్యను ప్రజలు భక్తి ప్రపత్తులతో పూజిస్తున్నారు. తొలి పూజలు అందుకునే విఘ్నేశ్వరుని వాడవాడలా కొలుస్తున్నారు. పెదవాల్తేరు శ్రామికనగర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఏయూ అవుట్‌గేట్ డౌన్‌లో శ్రీరామలక్ష్మి గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ప్రతిమకు పూజలు చేస్తున్నారు.

దుర్గాగణపతిని దర్శించుకున్న మేయర్

సీతంపేట: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయాన్ని బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి సందర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ను 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఘనంగా సత్కరించి ప్రసాదాలు, జ్ఞాపిక బహూకరించారు.

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద భక్తులు 108 కొబ్బరి కాయలు కొట్టారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పందిరి వద్ద బుధవారం సాయంత్రం మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, బి.సూర్యనారాయణ, పోలిరాజు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని జిల్లా బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఈ బిల్లును కొత్త పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు ఈ బిల్లు ద్వారా సముచితస్థానం లభిస్తుందన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు చట్టసభలకు ఎంపికై రాజకీయాల్లోను వారి చాతుర్యాన్ని చాటనున్నారని చెప్పారు. ఈ బిల్లు ఆమోదంతో ప్రధాని మోదీకి దేశంలోని మహిళలు అందరూ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ టపాసులు కాల్చడంతో పాటు ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మహిళ అధ్యక్షురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అక్కినేనికి స్వర నీరాజనం



కంచర్ల అచ్యుతరావును అక్కినేని పురస్కారంతో సత్కరిస్తున్న అభిమానులు

మద్దిలపాలెం : నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కళాంజలి సినీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్వర నీరాజనం పలికారు. కార్యక్రమాన్ని అతిధులుగా సూరపనేని విజయకుమార్, జాలాది విజయ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కె.రాజేంద్రప్రసాద్, మంగవేణీల బృందం అక్కినేని హిట్ సాంగ్‌ను ఆలపించారు. శంబర జోగారావు సంగీతంలో ఎంవీఆర్ వ్యాఖ్యతగా వ్యవహించారు. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావును అక్కినేని పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమానికి చెన్నా తిరుమలరావు సారథ్యం వహించారు.

15వ వార్డులో క్షేత్ర పర్యటన



వార్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. దుర్గానగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్ సత్తిబాబు, వెంకటలక్ష్మి, బుగత ఏసురత్నం, త్రినాథరావు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

సవరణ

తేది 20-09-2023న సాక్షి దినపత్రికలో శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం, పెదవాల్తేరు, విశాఖపట్నం ఈ-ప్రొక్యూర్‌మెంట్ కం సీల్డ్ టెండర్లు కం బహిరంగ వేలం (ఆర్.సి. నెం. 19/2023 తేది 18.09.2023) ప్రకటనలో తేది 29-09-2023 శనివారంగా ప్రచురించబడినది. పాఠకులు 29-09-2023 శుక్రవారంగా చదువుకొనగలరు.

P. శంకర రెడ్డి, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి — శ్రీమతి K.గాయత్రీ, B.Tech, కార్యనిర్వహణాధికారిణి